క్లుప్తంగా

భూ కబ్జాలపై దర్యాప్తు చేయాలి



మాట్లాడుతున్న ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్ఎస్ నాయకులు చేసిన భూ కబ్జాలపై అధికారులు దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సూడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి కుమారుడు వంగ ప్రవీణ్‌రెడ్డి మిట్టపల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. వారి అనుచరుల పేరుతో భూ రికార్డుల్లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు కబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భారీగా ఆస్తులు కూడబెట్టిన వంగ ప్రవీణ్‌రెడ్డిపై ఏసీబీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట యువజన పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రశద్, నజ్జు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. గురువారం పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీలో కేపీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆస యాదగిరి , కోఆప్షన్ మెంబర్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. అదేవిధంగా ఈనెల 23వ తేదీన గ్రామాల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం గ్రామ సభలను ఏర్పా టు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ శోభాయాత్ర


శ్రీరాముడి అక్షింతలతో భక్తుల శోభాయాత్ర

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో గురువారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో రామ జన్మభూమి పూజిత అక్షింతలకు పూజ చేశారు. ఈసందర్భంగా వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బుస్స నరేష్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి అయోధ్య శ్రీరాముల వారి పూజిత అక్షింతలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు శ్రీనివాస్, రాజు, పర్శరాములు, లింగం తదితరులు పాల్గొన్నారు.

'రాహుల్ క్షమాపణ చెప్పాలి'

నంగునూరు(సిద్దిపేట): రాజ్యసభ చైర్మన్, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్‌ను అవమానించేలా మిమిక్రి దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రికరించిన రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బెదురు కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం నంగునూరులో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రజినీకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్, అంబదాస్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గజ్వేల్‌రూరల్ / మద్దూరు(హుస్నాబాద్): మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సేయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో గురువారం ముందస్తుగా సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు మేరీమాత, జ్ఞానులు, రాజులు, దూతలు, సంటక్లాస్ వేషధారణతో అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ కాటా రాయప్ప మాట్లాడుతూ.. విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యతను తెలియజేస్తూ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలంలోని లద్నూరులో బేతానియ చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పాస్టర్ డాక్టర్ సుధీర్‌రాజ్ మాట్లాడుతూ.. అందరూ ఏసు చూపిన శాంతి మార్గంలోనే నడవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జీడికంటి సుదర్శన్, మాజీ సర్పంచ్ రావుడుగు బాలరాజు, చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మద్దూరు: కేక్ కట్ చేస్తున్న పాస్టర్ తదితరులు


ప్రజ్ఞాపూర్‌లోని సేయింట్ మేరీస్‌లో..

పిల్లలను బడిలో చేర్పించాలి

చేర్యాల(సిద్దిపేట): బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఇన్‌చార్జి ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆకునూరు కాంప్లెక్స్ పరిధి, తాడూరులో జరిగిన సర్వేలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 నుంచి 14 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు బడి బయట ఉంటే వెంటనే వారిని పాఠశాలలో నమోదు చేయాలని సూచించారు. అలాగే విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ కనకరాజు తదితరులు ఉన్నారు.


సర్వే నిర్వహిస్తున్న ఎంఈఓ నర్సింహారెడ్డి

రామానుజన్ సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న ఎస్సై నరేష్

మిరుదొడ్డి(దుబ్బాక): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ సేవలు మరువలేనివని.. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని మిరుదొడ్డి ఎస్సై నరేష్ అన్నారు. మండల పరిధిలోని అందే గ్రామంలో మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం గణిత దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం రాములు, ఎస్సై నరేష్ మాట్లాడుతూ.. ప్రజలు, విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, గ్రామ పెద్దలు వరాల రాజు, కడారి యాదగిరి, రాజేందర్, ఉపాధ్యాయులు, మిత్ర యూత్ అధ్యక్షుడు భాను, ప్రసాద్, సభ్యులు అంజనేయులు, నవీన్, మహేందర్, విక్రాంత్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

చిన్నకోడూరు(సిద్దిపేట): వరి నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ జయంత్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దకోడూరులో నారు మడులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రతతో పోషకాల లభ్యత తగ్గిపోయి వరి నారు ఎర్రబడి ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. ఇందుకు ప్రతి రోజు నారుకు కొత్త నీరు పెట్టాలన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జింకు లోపం ఏర్పడి ఆకులపై మచ్చలు ఏర్పడుతాయన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.


వరి నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ

బస్సులు ఆపడంలేదని ఆగ్రహం


చిల్వేర ఐబీ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సుకు అడ్డంగా నిలబడిన మహిళలు

అల్లాదుర్గం(మెదక్): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు ఇబ్బందిగా మారింది. స్టేజీల వద్ద కొందరు డ్రైవర్లు ఆపడం లేదు. అధికారుల ఆదేశాల మేరకే ఆపడంలేదనే విమర్శలున్నాయి. బస్సులు ఆపడంలేదని డిపో మేనేజర్‌కు ఫోన్ చేస్తే, బస్సు నిండటంతో ఆపడంలేదని సమాధానం ఇవ్వడం గమనార్హం. మండలంలోని చిల్వేర ఐబీ చౌరస్తాలో రేగోడ్, రాయికోడ్, వట్‌పల్లి, అల్లాదుర్గం ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఇక్కడే ఎక్కుతారు. ఐబీ చౌరస్తాలో గురువారం ఉదయం 10 గంటల సమయంలో బస్సులు ఆగకుండా వెళ్లాయి. దీంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుకు అడ్డంగా నిలుచున్నారు. బస్సులు ఎందుకు అపడం లేదని సంగారెడ్డి డిపోకు చెందిన ఏపీ23 జెడ్ 0072 బస్సు డ్రైవర్‌ను ప్రయాణికులు నిలదీశారు. ప్రయాణికుల ప్రశ్నలకు డ్రైవర్ సమాధానం ఇవ్వలేదు. ఈ విషయంపై నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసినా సరైన సమాధానం చెప్పలేదని స్థానికులు తెలిపారు. ఎక్కువ మంది మహిళలు ఉంటే బస్సును ఆపొద్దని అధికారులు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నట్లు విమర్శలున్నాయి.

రోడ్డు వేయాలని ఆందోళన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తమ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం సీసీ రోడ్డును ధ్వంసం చేశారని.. తిరిగి రోడ్డు వేయడంలో కౌన్సిలర్, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీ మహిళలు రోడ్డెక్కారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని 20వ వార్డులోని మహిళలు గుంతలమయమైన సీసీ రోడ్డును బాగు చేయాలని నిరసన తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డును బాగు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హుస్నాబాద్ మున్సిపాలిటీ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ దుర్గా శ్రీనివాస్ గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలోని ఆకారం చౌరస్తా వద్ద జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట– భూంపల్లి మండలం చిన్ననిజాంపేటకు చెందిన పోల ఈశ్వర్ టీవీఎస్ ఎక్సెల్‌పై భార్య, మరదలును ఎక్కించుకుని పని నిమిత్తం దుబ్బాకకు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి నిజాంపేట వైపు వెళ్తున్న క్రమంలో దుబ్బాక నుంచి అజాగ్రత్తగా బుల్లెట్ బండి నడుపుకుంటూ వచ్చిన వ్యక్తి వీరు ప్రయాణిస్తున్న బండిని వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఈశ్వర్, ఎల్లవ్వ, పద్మకు తీవ్ర గాయాలయ్యాయి. అతి వేగంగా, అజాగ్రత్తగా బండి నడిపిన మాడబోయిన కల్యాణ్‌పై గురువారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూఢ నమ్మకాలను నమ్మొద్దు

కొండపాక(గజ్వేల్): మూఢ నమ్మకాలను నమ్మి మోసపోవద్దని సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి ప్రజలను కోరారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్‌లో గురువారం రాత్రి పోలీసులు కనివిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

దుబ్బాకరూరల్: మండలంలోని కమ్మరపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో గతేడాది మరమ్మతుల కోసం రోడ్డును తవ్వి కంకర, డస్ట్ పోశారు. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో ప్రయాణికులు ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే జంకుతున్నారు. రాత్రి వేళలో ఇబ్బంది పడుతున్నామని.. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.


కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- వైస్ చైర్మన్‌పై సైతం..
- తీర్మాన కాపీని అదనపు కలెక్టర్‌కు అందించిన కౌన్సిలర్లు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డిలపై అవిశ్వాసం ప్రవేశ పెడుతూ తొమ్మిది మంది కౌన్సిలర్లు తీర్మానం చేశారు. తీర్మానపత్రాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు అందించారు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చేర్యాల మున్సిపల్ పరిధిలోని 12 వార్డులకు 5 వార్డుల్లో బీఆర్ఎస్, 5 వార్డుల్లో కాంగ్రెస్, ఇద్దరు స్వతంత్రులు గెలుపొందారు. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ స్వతంత్రుల మద్దతు కూడగట్టుకుని చైర్‌పర్సన్‌గా అంకుగారి స్వరూపరాణిని, వైస్ చైర్మన్‌గా స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన నిమ్మ రాజీవ్‌రెడ్డికి అవకాశం కల్పించింది. మొదటి నుంచి చైర్‌పర్సన్‌కి సభ్యులకు ఉప్పు నిప్పుగానే సాగింది. గతంలో అవిశ్వాసం పెట్టేందుకు అధికార బీఆర్ఎస్ సభ్యులు చేసిన ప్రయత్నం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జోక్యంతో ఆగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడం, బీఆర్ఎస్ సభ్యుల్లో సఖ్యత లోపించడంతో మళ్లీ అవిశ్వాసానికి దారి తీసింది. దీంతో బీఆర్ఎస్‌కి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, కాంగ్రెస్‌కి చెందిన 5 గురు కౌన్సిలర్లు, స్వతంత్ర కౌన్సిలర్ ఒక్కరు మొత్తం తొమ్మిది మంది చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతున్నట్టు తీర్మానం చేసి అదనపు కలెక్టర్‌కు అందించారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ కౌన్సిలర్లు చెవిటి లింగం, ఉడుముల ఇన్నమ్మ, సందుల సురేష్, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, బీఆర్ఎస్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్, స్వతంత్ర అభ్యర్థి జుబేదా ఖతూన్ ఉన్నారు. తీర్మాన కాపీ అదనపు కలెక్టర్‌కు అందించిన సభ్యులు త్వరలోనే క్యాంపునకు తరలివెళ్లనున్నట్లు సమాచారం.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

బెజ్జంకి(సిద్దిపేట): ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గుండారం గ్రామానికి చెందిన వైఎస్ జగన్ అభిమాని పత్తి వెంకటేష్ గాగిళ్లాపూర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.


వృద్ధులకు పండ్లు, బ్రెడ్ అందజేస్తున్న వెంకటేష్



పద్మపీఠం బహూకరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వీర సావర్కర్ సేవా సమితి సభ్యులు గురువారం మోహినిపుర వెంకటేశ్వర స్వామికి పద్మ పీఠం బహూకరించారు. దేవస్థానం ఆవరణలో సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి హుండీలో సమర్పించిన కట్న, కానుకలతో స్వామి వారికి పద్మ పీఠం తయారు చేసి అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, వీర సావర్కర్ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మల్లన్న ఉత్సవాలు


మల్లికార్జున స్వామి

- ఐదు రోజులపాటు నిర్వహణ
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు

టేక్మాల్(మెదక్): కొండల నడుమ కొలువైన మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఐదురోజులపాటు జరగనున్నాయి. ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తారు. ఉత్సవాల నిర్వహణ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. టేక్మాల్ మండలం కాద్లూర్‌లో ఏటా మల్లన్న ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. గ్రామ సర్పంచ్, గ్రామపెద్దల సమక్షంలో ముందస్తు సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చిస్తారు. కులమతాలకతీతంగా చందాలు వేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఐదురోజుల పాటూ జరిగే ప్రతి ఉత్సవంలో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతుంది.

రేపటి నుంచి ఉత్సవాలు

ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోచ యాదయ్య గురువారం తెలిపారు. 23న బోనాలు సమర్పిన, 24న బండ్ల శకటోత్సవం , 25న కుస్తీ పోటీలు, అన్నదాన కార్యక్రమము, 26న రథోత్సవం, 27న పాచి బండ్ల ఊరేగింపు జరుగుతాయన్నారు. కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటూ ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరిస్తామన్నారు. ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నట్లు తెలిపారు.

> **విజయవంతం చేయాలి**
>
> శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాం. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. కుస్తీ పోటీలు, బండ్ల ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాం.
>
> – యాదయ్య, సర్పంచ్, కాద్లూర్

సంక్షిప్త వార్తలు

◆ మండల స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్‌గా కృష్ణ

మర్కూక్(గజ్వేల్): మండల స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్‌గా ఎర్రవల్లికి చెందిన క్రీడాకారుడు కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండలంలోని గంగాపూర్‌లో మండలంలోని క్రికెట్ క్రీడాకారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన స్పోర్ట్స్ క్లబ్ సభ్యులను ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఐలేని యాదవ్, వైస్ చైర్మన్‌గా రవీందర్, ప్రచార కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా హరిబాబు, సలహాదారులుగా మల్లేశం, సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ ఆర్థిక సాయం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు పిల్లి ఎల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. గురువారం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చెరుకు నారాయణ, సభ్యులు రవి, రమేష్, కనకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



సిద్దిపేటకమాన్: అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్, ఇతర విద్యార్థి సంఘాలు జనవరి 12న నిర్వహించనున్న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, పవన్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ పల్లవి ప్రశాంత్ అరెస్ట్ సరికాదు

గజ్వేల్‌రూరల్: బిగ్‌బాస్ సీజన్–7 విన్నర్ పల్లవి ప్రశాంత్ అరెస్ట్ సరికాదని డీబీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. దాడికి కారకులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, దళిత సంఘాల నాయకులు బాల్‌నర్సయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ నివాళి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ పురోహితుడు రామక చంద్రమౌళి శర్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం వారి కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సీపీఐ నాయకులు గడిపె మల్లేశ్, సంజీవరెడ్డి, కౌన్సిలర్ గోవిందు రవి తదితరులు పాల్గొన్నారు.



◆ పరామర్శ

దుబ్బాకటౌన్: కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఆల్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ శంకర్ కుటుంబాన్ని గురువారం ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు గురువారం పరామర్శించారు. శంకర్ తల్లి సుశీలమ్మ ఇటీవల మరణించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక, శ్రీరాం రవీందర్, జెన్నారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు కరికె శ్రీనివాస్, బత్తుల చంద్రం, వనం రమేష్, బాణాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్

అక్కన్నపేట(హుస్నాబాద్): సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు బానోత్ అనిల్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో కులాలు, మతాలవారీగా వారి వారి పండుగలకు వారి గురువుల జయంతికి సెలవులు ఉన్నాయని, బంజారాలకు మాత్రమే సెలవు లేదన్నారు. అలాగే ప్రతి ఏటా సేవాలాల్ మహారాజ్ ఆలయాల వద్ద ఎద్ద పెత్తున మహా భోగ్ బండార్ పూజాలను నిర్వహించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూక్య పవన్, కళ్యాణ్‌నాయక్, రాకేష్, జగదీశ్వర్, వినయ్, వర్ధన తదితరులు పాల్గొన్నారు.